Office : 24754266, 24754566,
23466171, 23466172, 23466173
Fax : 040-24752966
G.S. 9866171277
e-mail : sbisuhc.gs@gmail.com
Website : www.sbisuhc.co.in

SBISUHC

# State Bank of India Staff Union Hyderabad Circle

H.Q. HYDERABAD Regd. No. 1990
(AFFILIATED TO ALL INDIA STATE BANK OF INDIA STAFF FEDERATION)
Post Box No. 528, SBI Buildings, Bank Street, Koti, HYDERABAD - 500 095.

CIRCULAR LETTER NO. 08 Date : 25-12-2019
TO ALL UNITS / MEMBERS

డియర్ కామ్రేడ్ !

## క్రొత్త ఆశలు పల్లవించే నూతన సంవత్సరానికి స్వాగతం

'వచ్చుకాలము మేలు గతకాలము కంటెన్' అన్న ఆశావహ దృక్పథంతో మనం కొత్త ఏడాదిని ప్రారంభించ బోతున్నాము. మనం నిర్దేశించుకున్న ఆశయాలకు ఆచరణ రూపం ఇవ్వడానికి, లక్ష్యాలను సాధించడానికి పునరంకితమై రెట్టించిన ఉత్సాహంతో నూతన సంవత్సరం 2020కి ఎదురేగి స్వాగతం పలుకుదాం. ఉద్యమాల పథం మీద, శ్రమిక మనోరథం మీద సాగుతున్న మన యూనియన్ విజయప్రస్థానాన్ని అప్రతిహతంగా ముందుకు కొనసాగిద్దాం.

ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, విజయాల కలబోతగా ఘటనా భరితంగా 2019 సంవత్సరం కొనసాగింది. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల తీవ్ర ప్రతిఘటనల మధ్య ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించడానికి ప్రభుత్వం మొండిగా ప్రయత్నిస్తూనే వచ్చింది. 11వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం విషయంలో ప్రభుత్వ సాచివేత వైఖరి ఫలితంగా అసాధారణ జాప్యం జరగడం బ్యాంక్ ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తినీ, ఆగ్రహావేశాలను రగిలించింది. హేతుబద్ధమైన వేతన సవరణ కోసం మన పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది. మన జాతీయ నాయకత్వం ఎప్పుడు నగారా మ్రోగించినా కదనరంగంలో కదం తొక్కడానికి సర్వసన్నద్ధంగా నిలవాలని సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

మన బ్యాంక్ స్థాయిలో వర్క్‌మెన్ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, శారీరక లోపాలున్న ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్, సబార్డినేట్ క్యాడర్ నుంచి క్లరికల్ క్యాడర్‌కు పదోన్నతికి సంబంధించి ప్రత్యేక ఛానల్, ఉద్యోగుల సాధికారికతకు సంబంధించిన విషయాలమీద బ్యాంక్ యాజమాన్యానికీ ఫెడరేషన్‌కు మధ్య కుదిరిన ఒప్పందాల ద్వారా ఉద్యోగులకు ఎన్నో ప్రయోజనాలను సాధించగలగడం మనకు గర్వకారణంగా భావించవచ్చు. 2019లో బిలీవ్‌మెంట్ సెలవు మంజూరీకి సంబంధించి ఒప్పందం కుదరడం కూడా బ్యాంకింగ్ పరిశ్రమలోనే ఒక ప్రత్యేక విజయంగా భావించవచ్చు. సర్వీసులో ఉండగానే మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, మద్దతును అందించడానికి **"అటూట్"** పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా మన బ్యాంక్ తన అగ్రగామి స్వభావాన్ని మరోసారి చాటి చెప్పింది.

.. 2 ..

ఇక సంస్థాగత విషయాలకు సంబంధించి గుంటూరు క్రెడిట్ సొసైటీతో కలిసి మన యూనియన్ సంయుక్తంగా నిర్మించిన అతిథిగృహం ఉద్యోగుల వినియోగార్థం 2019లో అందుబాటులోకి వచ్చింది. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సహా అగ్రశ్రేణి సీనియర్ నాయకులు ఈ ఏడాదే బ్యాంక్ సర్వీసు నుంచి రిటైరయ్యారు. ప్రధాన నేతల పదవీ విరమణతో ఏర్పడిన లోటును సభ్యులందరి సహాయ సహకారాలతో భర్తీచేయగలమని విశ్వసిస్తున్నాను. 2019లో యూనియన్ సర్వసభ్య సమావేశంతో పాటు యూనియన్ స్వర్ణోత్సవాలను కూడా అత్యంత వైభవోపేతంగా నిర్వహించుకున్నాం. ఆ ఉత్సవాలు మరపురాని మధురస్మృతులుగా మన మనసుల్లో చిరకాలం నిలిచిపోతాయి.

మన యూనియన్‌ను ఓటమెరుగని కోటగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్న సీనియర్ నాయకులను స్వర్ణోత్సవ సందర్భంలో వేలాదిమంది యువ కామ్రేడ్ల సమక్షంలో ఘనంగా సత్కరించడం జరిగింది. గత ఐదు దశాబ్దాల సుదీర్ఘ సమైక్య ఉద్యమ ప్రస్థానంలో మన యూనియన్ నూతన జవ సత్వాలను నింపుకుంటూ ఎలా అజేయశక్తిగా రూపొందిందో ఈ స్వర్ణోత్సవాలు యువతరం కామ్రేడ్లందరికి కళ్లకు కట్టినట్లు చూపించగలిగాయి. ఆగస్ట్ 2019లో జరిగిన సర్వసభ్య సమావేశంలో యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోనడం ద్వారా చెక్కు చెదరని ఐక్యతను మరోసారి చాటి చెప్పిన సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సువిశాల, అవిభక్త ఆంధ్రప్రదేశ్ విభజింపబడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు రెండు ప్రత్యేక రాష్ట్రాలుగా అవతరించడంతో మన బ్యాంక్‌లో కూడా ఒక కొత్త సర్కిల్ ఏర్పాటయింది. తత్ఫర్యవసానంగా మన ప్రియతమ యూనియన్‌ను కూడా 2019లో రెండు యూనియన్లు (SBISU హైదరాబాద్ సర్కిల్, SBISU అమరావతి సర్కిల్)గా విభజించవలసి వచ్చింది. ఈ పరిణామాన్ని యూనియన్ చరిత్రలో మరో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించవచ్చు. అనివార్య కారణాల వల్ల రెండు సర్కిళ్లలో రెండు యూనియన్లుగా ఏర్పాటైనప్పటికీ ప్రజాస్వామ్య విలువలు, రాజకీయేతర స్వతంత్ర కార్మికోద్యమ సిద్ధాంతాల పునాదుల మీదే పనిచేస్తున్నాయి కాబట్టి బ్యాంక్ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సమైక్య సంఘటిత పోరాటాలలో అవి సహజంగానే అగ్రగామి పాత్ర నిర్వహిస్తాయని ఆశిస్తున్నాను.

ఐక్యత నేటి తక్షణావశ్యకత. భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, తగిన సంఖ్యలో సిబ్బంది నియామకం, ఉద్యోగ భద్రత కల్పించడం, గౌరవప్రదమైన వేతన సవరణ సాధించడం, సర్వీస్ కండిషన్లను మెరుగు పరచడం తదితర లక్ష్యాల సాధన కోసం కొత్త సంవత్సరం 2020లో నిర్విరామ కృషి కొనసాగవలసి ఉంది.

భారతదేశ బ్యాంకింగ్ రంగంలో ప్రధాన బ్యాంక్‌గా మన **'భారతీయ స్టేట్ బ్యాంక్'**కున్న స్థానాన్ని పది కాలాల పాటు పదిలంగా కాపాడవలసిన బాధ్యత కూడా మన భుజస్కంధాలమీదే ఉంది. అంకిత భావంతో కూడిన సేవలను ఖాతాదారులకు అందించడం ద్వారా బ్యాంక్ వ్యాపార పరిణామాన్ని, లాభదాయకతను పెంచడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి మనం కృషిచేయవలసి ఉంది.

ద్విగుణీకృత ఉత్సాహంతో, ఆత్మవిశ్వాసంతో, క్రొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతగీతిక ఆలపిద్దాం. నూతన సంవత్సరాన్ని మన బ్యాంక్‌కి, యూనియన్‌కు విజయ ఫలాలనందించే **"సాధనా సంవత్సరం"**గా ప్రకటిద్దాం. గతంలోలాగే 2020లో కూడా మన ఐక్యతను ప్రాణ సమానంగా కాపాడుకొంటూ నూతన విజయాలను సాధించడంలో యూనియన్ కృషికి అండదండలు అందిస్తూనే ఉండాలని సభ్యులందరికీ మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను.

క్రొత్త ఏడాది మన కామ్రేడ్లందరి జీవితాల్లో వినూత్న చైతన్యజ్యోతులు ప్రకాశించాలని, సకల శుభాలు వారికి సమకూరాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

**విప్లవాభినందనలతో**

(ఆర్. శ్రీరామ్)

ప్రధాన కార్యదర్శి

❊ ❊ ❊